సాక్షి నల్లగొండ

మంగళవారం। 16। సెప్టెంబర్। 2025



మల్టీపర్పస్ వర్కర్ అరెస్ట్

చోరీలకు పాల్పడుతున్న పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



దేశవ్యాప్తంగా యూరియా కొరత

దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.60 అడుగులు
ఇన్‌ఫ్లో	:	49,125 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	50,847 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,698 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,949 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

రేపు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- జాతీయజెండా ఆవిష్కరించనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దినోత్సవాల సందర్భంగా ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం బాలబాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి తెలిపారు.

విద్యారంగంలో మతోన్మాద బీజాలు




మాట్లాడుతున్న కోట రమేష్

చండూరు: విద్యారంగంలో మతోన్మాద బీజాలు నాటుతున్న బీజేపీపై పోరాడాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. సోమవారం చండూరులో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల రెండో రోజు సభకు వారు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యారంగంలో విద్యార్థులకు మూఢవిశ్వాసాలను బోధింపజేస్తూ విద్యారంగాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టిందన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, రాష్ట్ర కోకన్వీనర్ కుంచం కావ్య, సైదానాయక్, బెడిగ వెంకటేశ్, కొరె రమేష్, రవీందర్, కిరణ్, నవదీప్, జగన్, జగదీష్, వీరన్న, ప్రసన్న, ప్రణీత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలకు చెందిన బీఎస్సీ ఎంపీసీఎస్ ఫస్టియర్ విద్యార్థి ఎస్.మనోజ్ తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 73 కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో నిర్వహించే జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, పీడీ డాక్టర్ ఏ.మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్‌ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

మూడు గేట్ల ద్వారా 'మూసీ'నీటి విడుదల



ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 6,019 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు సోమవారం ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి ఉంచి 4,836 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 434 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం 643.70 అడుగుల వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వచ్చే నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. 4.46 టీఎంసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 4.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శివాలయంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల సేవను ఊరేగించారు. ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. సుప్రభాత సేవ, నిత్యకల్యాణం నిర్వహించారు.



నల్లగొండలోని ఎంజీయూ స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు



కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ అందుకుంటున్న పి.రవికుమార్



గోల్డ్ మెడల్ పొందిన ఆనందంలో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

'మహా'నందం

నల్లగొండ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో సోమవారం నిర్వహించిన నాల్గవ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. - 8లో

అమ్మకానికి దొడ్డు బియ్యం

జిల్లాలో మిగిలిపోయిన 5,927 మెట్రిక్ టన్నుల బియ్యం

- ఏప్రిల్ నుంచి ప్రజలకు సన్న బియ్యం ఇస్తున్న ప్రభుత్వం
- అంతకు ముందు నెలల్లో వచ్చి అలాగే నిల్వ ఉన్న దొడ్డు బియ్యం
- విక్రయించి భారం తగ్గించుకునేలా ప్రభుత్వం చర్యలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం ఇ–వేలం ద్వారా అమ్మకానికి పెట్టాలని నిర్ణయించింది. జిల్లాలోని గోదాములు, మండల స్థాయి స్టాక్ పాయింట్లు (ఎంఎల్ఎస్), రేషన్ షాపుల్లో మిగిలిపోయిన ఆ బియ్యాన్ని వేలం వేసేందుకు చర్యలు చేపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పౌర సరఫరాల శాఖ ఈ వేలం ద్వారా మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని విక్రయించాలని నిర్ణయించగా, అందులో జిల్లా వ్యాప్తంగా 5,927 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని వేలం వేసేందుకు సిద్ధమవుతోంది.

దొడ్డు బియ్యం నిల్వలు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో..)	
గోదాముల్లో	4,322.057
ఎంఎల్ఎస్ పాయింట్లలో	105.792
రేషన్ షాపుల్లో	1,500

ఆరు నెలల తరువాత..

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పథకాన్ని ఈ ఏడాది మార్చి 30న ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో కూడా అదే రోజునుంచి రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యాన్ని అందిస్తోంది. అయితే అప్పటి వరకే ఆయా రేషన్ షాపులతోపాటు గిడ్డంగులు, ఎంఎల్ఎస్ పాయింట్లలో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. అయితే సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన ప్రభుత్వం, వర్షాకాలం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలెవరూ వర్షాలు కురిసేప్పుడు రేషన్ షాపులకు వెళ్లి ఇబ్బంది పడకుండా ఒకేసారి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్‌ను జూన్ నెలలోనే పంపిణీ చేసింది. దీంతో జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గోదాములన్నీ మూసే ఉన్నాయి. అయితే అప్పటికే రేషన్‌షాపులు, గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఉన్న దొడ్డు బియ్యం విషయంలో మాత్రం ప్రభుత్వం అప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అవన్నీ ఆరు నెలలుగా వాటిల్లోనే ఉండిపోయాయి. రెండు నెలలు రేషన్ షాపులు తెరవక పోవడంతో కొన్ని చోట్ల ఆ బియ్యానికి పురుగులు పడుతున్న పరిస్థితి కూడా ఏర్పడింది. అయితే ఆరు నెలల తరువాత ప్రస్తుతం నెలలో రేషన్ షాపులు మళ్లీ తెరిచి సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే సన్న బియ్యం, దొడ్డు బియ్యం ఒకేచోట ఉండటంతో దొడ్డు బియ్యానికి పట్టిన పురుగులు సన్న బియ్యానికి పట్టే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు సన్న బియ్యం వస్తున్న తరుణంలో పాత దొడ్డు బియ్యం కూడా అవే షాపుల్లో నిల్వ ఉండటంతో స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, గోదాములకు తీసుకెళ్లాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలెక్టర్‌కు, ప్రభుత్వానికి విన్నవించారు. అయినా ప్రభుత్వం అప్పట్లో వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఎట్టకేలకు ఇ- వేలం వేసేలా నిర్ణయం

ఆరు నెలల తరువాత ప్రభుత్వం ఎట్టకేలకు దొడ్డు బియ్యాన్ని ఇ–వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కిలోకు రూ.24ల చొప్పున ఈ వేలం ద్వారా విక్రయించేందుకు సిద్ధం అవుతోంది. గిడ్డంగులు, ఇటు రేషన్ షాపుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల బియ్యం దెబ్బతినే అవకాశం ఉంది. అదేవిధంగా వానాకాలం సీజన్ చివరి దశకు వస్తుండటంతో మళ్లీ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ బియ్యం) వస్తే నిలువ చేసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనికి తోడు ఆరు నెలలుగా అలాగే ఉండిపోయిన బియ్యం విక్రయించడం వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడంతో పాటు, ఆదాయం రానుంది.

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- మాదకద్రవ్యాల నిర్మూలనపై దృష్టిపెట్టండి
- మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ముఖాముఖి



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నల్లగొండ: జిల్లాను టీబీ, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం ఆయన మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నాలుగవ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ముఖ్యులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమానికి భారత ప్రధాని ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలో కవులు, కళాకారులు, రచయితలు వివిధ రంగాల్లోని ప్రముఖులను టీబీ ముక్త్ భారత్‌లో భాగస్వాములను చేసి వారితో వివిధ చైతన్య కార్యక్రమాల చేపట్టడం ద్వారా టీబీ నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనపై శ్రద్ధ తీసుకోవాలని, మహిళా సాధికారతకు కృషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయ వీసీల నుంచి కింది స్థాయి వరకు అందరూ భాగస్వాములు అయితే టీబీ, మాదకద్రవ్యాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు అందేలా చూడాలన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రముఖులు సమాజానికి సేవ చేసేలా ఎంపీ రఘువీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య, విద్య పథకాల అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి జిల్లా యంత్రాంగాన్ని ప్రశంసించారు.

పథకాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర గవర్నర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పలు పథకాల గురించి సమగ్రంగా వివరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లాలో శాంతి భద్రతలపై గవర్నర్‌కు వివరించారు. అలాగే లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్ మోహన్, ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు, వైద్యులు జయప్రకాశ్‌రెడ్డి, సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, కవి సగర్ల సత్తయ్య, దుశ్చర్ల సత్యనారాయణ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణకాంత్ నాయక్, రైతు రాంరెడ్డి, పదవ తరగతి జిల్లా టాపర్ విద్యార్థిని అమూల్య, హెచ్ఐవీపై పనిచేస్తున్న సంఘసంస్కర్త మేరీలు వారు చేస్తున్న సేవల వివరాలను గవర్నర్‌కు వెల్లడించారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జిల్లాలో టీబీ వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలు, చికిత్స, తదితర అంశాలను గవర్నర్‌కు వివరించారు. అంతకు ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీ రఘువీర్‌రెడ్డిలు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను శాలువా, మెమెంటోతో సన్మానించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

యంత్రాంగంతో కలిసి పనిచేస్తాం : ఎంపీ రఘువీర్‌రెడ్డి

నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ టీబీ, మాదకద్రవ్యాల నిర్మూలనకు ముఖ్యుల సలహాలు తీసుకోవడమే కాకుండా, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేస్తామన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో ఆసియాలోనే అతి పెద్ద రైస్ ఇండస్ట్రీ ఉందని, దీనివల్ల టీబీవంటి వ్యాధులు సోకకుండా ఈ ప్రాంతంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏసీపీ మౌనిక, డీఎఫ్ఓ రాజశేఖర్, రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు

అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు



నల్లగొండలో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్ : నూతన విద్యావిధానం అమలులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రవేశపెట్టి అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీటీయూ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడీలకు అప్పగించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 25న చలో సెక్రటేరియేట్ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం, సహాయ కార్యదర్శి దండెపల్లి సత్తయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి నాగమణి, కార్యదర్శి బొందు పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి, రమ, మణెమ్మ, సునంద, సైదమ్మ, ఫాతిమా, సరిత, స్వప్న, స్వరాజ్యం, సముద్రమ్మ, సుభాషిణి, ఎల్లమ్మ, జానమ్మ, సంధ్య, మల్లు గౌతంరెడ్డి, అవుట రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు సీజ్



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న రఘునందన్

నాంపల్లి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో అలువయ్య బిన్నీ రైస్ మిల్లును పౌర సరఫరా అధికారులు సోమవారం సీజ్ చేశారు. మండలంలో రేషన్ బియ్యాన్ని నూకలుగా చేసి దందా నడుపుతున్నట్లు సమాచారం తెలియడంతో సదరు రైస్ మిల్లులో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యంగా అనుమానించిన 60బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మిల్లును సీజ్ చేశారు. అంతకుముందు నాంపల్లి మండల కేంద్రంలో నాగార్జున బిన్నీ, రామకృష్ణ రైస్ మిల్లులను తనిఖీ చేసినట్టు పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తెలిపారు.

తీరని యూరియా కష్టాలు

- పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల వద్ద పడిగాపులు
- అక్కడక్కడా ఆందోళనలకు దిగుతున్న రైతులు
- నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం



యూరియా కోసం పెద్దవూరలో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్, మూసీ ఆయకట్టుతోపాటు బోరుబావుల కింద వరిపంట సాగు చేసిన రైతులు రెండు నెలలుగా యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతి రైతుకు రెండు బస్తాలు యూరియా ఇస్తుండడం, అది కేవలం ఎకరం పొలానికే సరిపోతుండడంతో ఎక్కువ ఎకరాలు సాగుచేసిన రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద బారులుదీరుతున్నారు. జూన్, జూలైలో మొదటిసారి చల్లాల్సిన యూరియా జూలై, ఆగస్టు నెలలో చల్లారు. ఎక్కువ భాగం పంటలకు యూరియా చల్లినప్పటికీ కొంతమేరకు ఇంకా చల్లాల్సి ఉంది. రెండవ విడత అక్టోబర్‌లో యూరియా చల్లాల్సి ఉంది. అలాగే జిల్లాలో పత్తిపంటకు కూడా యూరియా వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ముందస్తుగా కొనుగోలు చేసేందుకు రైతు సహకార సొసైటీలు, ఆగ్రోస్ దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈనెల చివరి వరకు కూడా రైతులకు యూరియా కష్టాలు తప్పేలా కనిపించడం లేదు.

60వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 33 మండలాలకు గాను వానాకాలం సీజన్‌కు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. జూన్‌లో యూరియా వాడకం ప్రారంభమైంది. సెప్టెంబర్ చివరి నాటికి పూర్తిస్థాయిలో యూరియా రావాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 60వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ, జిల్లాలో ఆయకట్టు విస్తీర్ణం పెరగడం వల్ల పంటలకు ఎక్కువగా నత్రజని అవసరం ఉండగా యూరియా వాడకం పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా మొత్తానికి 80వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా వ్యవసాయాధికారులు మాత్రం కేవలం 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదించారు.

యూరియా (వేల మెట్రిక్ టన్నుల్లో)	
జిల్లాకు కావాల్సిన యూరియా	80
ప్రభుత్వానికి నివేదించింది	70
ఇప్పటి వరకు పంపిణీ చేసింది	60

నానో యూరియా వాడకంపై ప్రచారం

భవిష్యత్‌లో ఎరువుల వాడకాన్ని తగ్గించి ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను వాడాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రాలకు యూరియా కేటాయింపు తగ్గించింది. దీంతో యూరియా కొరతపై ప్రభావం పడింది. ఇందులో భాగంగా బీజేపీయేతర రాష్ట్రాల్లో ఎరువుల కేటాయింపు తగ్గించడం, నానో యూరియాపై ప్రచారం చేయిస్తోంది. కాగా ఒక యూరియా బస్తా రూ.265కు విక్రయిస్తుండగా లీటర్ నానో యూరియా రూ.150 నుంచి రూ.200కు లోపు దొరుకుతుంది. కానీ, ద్రవరూపంలోని యూరియా వాడకంలో స్ప్రే మిషన్‌తోపాటు ఇద్దరు కూలీలు అవసరం ఉండడం వల్ల ఖర్చు పెరుగుతుందని రైతులు ఘనరూపంలోని యూరియా కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు.

అక్టోబర్‌లో యూరియా వాడకం చాలా కీలకం

కొన్ని ప్రాంతాల్లో వరిపంటను సాగుచేసి రెండు నెలలు దాటగా మరికొన్ని చోట్ల నెల, 45రోజులు అయింది. నాట్లు వేసిన 15–20రోజులలోపు దూపు కాడలు రావడానికి, పంటకు నత్రజని అందించేందుకు ఒకసారి యూరియాను చల్లుతారు. మళ్లీ రెండు నెలల తరువాత పంట గింజ తయారయ్యే సమయంలో యూరియాను చల్లుతారు. రెండోసారి 40–50 రోజుల మధ్య చల్లే యూరియా పంటకు బలం చేకూరుస్తుంది. అందుకు తప్పనిసరి పరిస్థితుల్లో ఆ సమయంలో యూరియాను చల్లుతారు. కాగా మొదటి దశలోనే యూరియా కొరత తీవ్రంగా ఉండడం వల్ల రెండో దశలో యూరియా దొరుకుతుందో లేదోనని రైతుల్లో ఆందోళన నెలకొంది.

నానో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తాం



పంటలకు ఉపయోగించే నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. వరి పంటలకు రెండు సార్లు యూరియా చల్లుతారు. ఇప్పటికే ఒకసారి పూర్తయింది. అక్టోబర్‌లో రెండోసారి యూరియా చల్లుతారు. ఇందుకోసం రైతులు ప్రాథమిక సహకార సొసైటీలు, దుకాణాల వద్ద క్యూకడుతున్నారు. ఘనరూపంలో ఉన్న యూరియా కాకుండా ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను వినియోగించినా ఉపయోగం ఉంటుంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

యూరియా కోసం రాస్తారోకో

పెద్దవూర: యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. పెద్దవూర మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు సోమవారం వేకువజామునే ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వద్దకు వచ్చి వరుసలో నిల్చున్నారు. రెండు, మూడు రోజుల క్రితం ఇచ్చిన టోకెన్లకు యూరియా బస్తాలు ఇచ్చారు. వీరితో పాటు మూడొందలకు పైగా రైతులు పీఏసీఎస్ వద్దకు వచ్చి తమకు టోకెన్లు ఇవ్వాలని అధికారులను వేడుకున్నారు. మధ్యాహ్నం జీరాక్స్ కాపీలను వరుసలో పెట్టిన రైతులందరికీ టోకెన్లు జారీచేస్తామని అధికారులు చెప్పారు. తర్వాత భోజనాన్ని వెళ్లి వస్తామని సాయంత్రం నాలుగు గంటలైనా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు మండల కేంద్రంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. గంటన్నరకు పైగా రాస్తారోకో చేయడంతో ఎటూ కిలోమీటర్ దూరం వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జిల్లా వ్యవసాధికారి, కలెక్టర్ వచ్చేదాకా రాస్తారోకోను విరమించేది లేదన్నారు. పోలీసులు వచ్చి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం అందరికీ టోకెన్లు జారీ చేయిస్తానని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

గోల్డ్ మెడల్ గ్రహీతలు



బిల్లెడ్ హారిక, ఎంకామ్ | కట్టబత్తిని మౌనిక, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ | రేణికింది శ్రావణి, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ | గద్దం వసుంధర, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ | శ్రీరాముల సజన, ఎంబీఏ ఫైనాన్స్

ఉయ్యాల భువనేశ్వరి, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | బొల్లు రవళి, ఎంబీఏ | పసుపులేటి శ్రావణి, బీటెక్ సీఎస్ఈ | నారబోయిన వర్షిత, బీకాం | మారోజు భవాని, ఎంఏ ఇంగ్లీష్

నందిగామ మౌనిక, ఎంఏ ఎకనామిక్స్ | రేణిగుంట్ల గాయత్రి, ఎంకామ్ | గూడూరు స్పందన, ఎంఎస్ డబ్ల్యూ | ముంత నాగరాణి, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ | బుస్సు రేణుక, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

అల్లేందల నవీన్‌కుమార్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ | మోత్కూరి సాయిరీష, ఎంఎస్సీ ఫిజిక్స్ | రెహమాన్ రహీల, ఎంఎస్సీ జువాలజీ | గోకార లిఖిత భార్గవి, ఎంఎస్సీ బయోటెక్నాలజీ | కందుల సౌజన్య, ఎంబీఏ ఫైనాన్స్

చౌడపునీది శ్రీలక్ష్మీ నారాయణ, ఎంసీఏ | మురహరికర్ అఖిల, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | ఆరుట్ల మహేష్, ఎంబీఏ | బోరాణ శ్వేత, బీటెక్ | బొమ్మకంటి పూజ, బీకాం

నందిపట్ల రమ్యశ్రీ, బీబీఏ | సుమయ్య బేగం, ఎంఏ ఇంగ్లీష్ | తుమ్మ ఆకాష్‌కుమార్, ఎంఏ ఎకనామిక్స్ | జలకం భవాని, ఎంఏ ఎకనామిక్స్ | వట్టి కోటి పూజ, ఎంకామ్

పతనబోయిన రమ్యశ్రీ, ఎంఎస్ డబ్ల్యూ | బానోతు రవి, ఎంఎస్ డబ్ల్యూ | పుష్పల కావ్య, సైన్స్ ఫ్యాకల్టీ | మర్రి స్వాతి, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ | ఆరుట్ల శివనగేష్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

నక్తి విజయలక్ష్మి, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ | జల్లల రుచిత, ఎమ్మెస్సీ ఫిజిక్స్ | రఘు నైపుణ్య, ఎంఏ ఇంగ్లీష్ | రట్లవత్ మౌనిక, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ | రావిరాల ప్రణతి, ఎంబీఏ ఫైనాన్స్

అమ్మిరెడ్డి దివ్య, ఎంసీఏ | ఎర్రమల్ల నవ్య, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | కె. భానుప్రకాష్, ఎంబీఏ | ఏషాల అజయ్‌కుమార్, బీటెక్

మారోజు పల్లవి, బీటెక్ | పదరాజు యామిని, బీకాం | కటకమోజు భవాని, బీబీఏ | దాసరి సాయి స్పందన, ఎమ్మెస్సీ జువాలజీ

కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఎంజీయూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు
- పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



స్నాతకోత్సవంలో జాతీయ గీతం ఆలపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగిన 4వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై 22 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 57 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. గవర్నర్‌కు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ అమిత్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థలంటే సమాజానికి దార్శనికత, విలువలు నేర్పేందుకు రూపొందించబడిన జీవన వ్యవస్థలని అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం విద్యతో పాటు పరిశోధనలు, ఆవిష్కరణలు, సేవా కార్యకలాపాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తూ విద్యార్థులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును బలోపేతం చేయడం, హాస్టల్, క్యాంపస్ సౌకర్యాలను మెరుగుపరచడం, సమ్మిళిత అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంపై యూనివర్సిటీ చూపుతున్న శ్రద్ధ ప్రశంసలకు అర్హమైందన్నారు. యూనివర్సిటీని జాతీయ స్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దడంలో పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ పెంపొందించడం చాలా అవసరమన్నారు. దేశ పురోగతి ఆ దేశ మానవ ప్రతిభపై ఆధారపడి ఉంటుందని.. పరిశోధన, ఆవిష్కరణలు దీనికి కీలకమన్నారు.



ఎంజీయూలో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ తదితరులు



ఎంజీయూ విద్యార్థులు తయారుచేసిన సోలార్ వాహనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కోవిడ్-19 వ్యాక్సిన్ అభివృద్ధి మన దేశ సత్తాను ప్రపంచానికి చాటిందన్నారు. ప్రస్తుతం భారత దేశం బహుళ రంగాల్లో రాణిస్తోందని, యూనివర్సిటీలు యువ మనస్సులను సజనాత్మకత, ఆవిష్కరణలతో పెంపొందిస్తాయన్నారు. భారత దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు పరిశ్రమలు నెలకొల్పేలా సిద్ధం చేయాలని కోరారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కనండి.. కలలు ఆలోచనలుగా రూపాంతరం చెందుతాయి, ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్నారు. అదేవిధంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఏడీసీ భవానీప్రసాద్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి దేవసేన, యూనివర్సిటీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్ తదితరులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.





స్నాతకోత్సవంలో పాల్గొన్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, విద్యార్థులు

అట్టహాసంగా స్నాతకోత్సవం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన నాల్గవ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

గోల్డ్ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉంది



నేను నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాను. 2022 బ్యాచ్‌కు చెందిన నేను ప్రభుత్వ కాలేజీలో చదివిన విద్యార్థిగా గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో ఎంజీయూలోనే పీహెచ్‌డీ పూర్తిచేస్తాను. – ఎన్. వర్షిత, నల్లగొండ

అసిస్టెంట్ ప్రొఫెసర్ అవుతా



మహబూబాబాద్ సమీపంలోని ఒక చిన్న గ్రామంలో పుట్టిన నేను మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూ చేసి గోల్డ్ మెడల్ సాధించాను. గిరిజన కుటుంబంలో పుట్టిన నాకు గోల్డ్ మెడల్ రావడం గర్వకారణంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో అసిస్టెంట్ ప్రొఫెసర్ అవుతాను. – బానోతు రవి, పెద్దనాగారం, మహబూబాబాద్

పరిశోధనలు చేస్తా



ఎంఎస్సీ బీఈడీలో గోల్డ్‌మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. పీహెచ్‌డీ ఫస్ట్ లెవల్ పూర్తిచేశాను. పీహెచ్‌డీ పూర్తిచేసి దేశానికి అవసరమైన పరిశోధనలు చేసి దేశాభివృద్ధిలో భాగస్వామిని అవుతాను. – సాయి స్పందన, నల్లగొండ

ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఎంజీ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తిచేసి గోల్డ్ మెడల్ అందుకున్నాను. భవిష్యత్తులో తప్పకుండా ప్రొఫెసర్ అయ్యి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాను. – మారోజు భవాని, నల్లగొండ

సామాజిక సేవ చేయాలని ఉంది



ఎంఎస్ డబ్ల్యూ, పీజీ పూర్తి చేశాను. పల్లెటూరులో పుట్టిన నేను గోల్డ్‌మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. సామాజిక సేవ చేయాలని ఉంది. – గూడూరు స్పందన, దీపకుంట, నల్లగొండ

గ్రూప్-1 సాధిస్తా



హాలియాలోని డిగ్రీ కాలేజీలో ఎంఎస్ డబ్ల్యూ, పీజీ పూర్తి చేశాను. గ్రామీణ ప్రాంతానికి చెందిన నాకు గోల్డ్ మెడల్ రావడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో గ్రూప్-1 ఉద్యోగం సాధించి పేద ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఉంది. – పి. రమ్య, హాలియా

పీహెచ్‌డీ పొందినవారు



కళ్యాణి, బిజినెస్ మేనేజ్‌మెంట్ | డి. వెంకటేష్, బిజినెస్ మేనేజ్‌మెంట్

బి. రాజేందర్‌గౌడ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | రమేష్ కార్తిక్, బిజినెస్ మేనేజ్‌మెంట్

బాల శ్రీప్రసాద్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | శ్యామ్‌సుందర్ తుమ్మ, బిజినెస్ మేనేజ్‌మెంట్

బానోతు రాజేంద్రనాథ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | వెల్‌సూరి హరిబాబు, బిజినెస్ మేనేజ్‌మెంట్

కె. వందన, బిజినెస్ మేనేజ్‌మెంట్ | ఎ. మమతా శ్రీదేవి, బిజినెస్ మేనేజ్‌మెంట్

వెలమకన్ని రాణిపద్మిని, బయో కెమిస్ట్రీ | డి. ప్రవీణ్, కెమిస్ట్రీ

సి. ఉషాభవాని, మ్యాథమెటిక్స్ | ఎంపీ మేరి న్యాగి, కెమిస్ట్రీ

ఎండీ ఖదీర్, కెమిస్ట్రీ | జీవీఆర్ సాయిమధుకర్, కెమిస్ట్రీ

జి. ప్రభాకర్, కెమిస్ట్రీ | వరికుప్పల పరుశురాం, కెమిస్ట్రీ

వి. శ్రీధర్, కెమిస్ట్రీ | పరకాల నరేష్, మ్యాథమెటిక్స్

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

మేళ్లచెరువు: చింతలపాలెం మండలం చింత్రియాలకు చెందిన బడుగుల సైదమ్మ (54) ఆదివారం గేదెలు మేపేందుకు గ్రామ పరిధిలోని కృష్ణా నది వద్దకు వెళ్లి గల్లంతు కాగా.. మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఆమె కుమారుడు గోపి రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకయ్య తెలిపారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీ పట్టివేత

గరిడేపల్లి: అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీని సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు గరిడేపల్లికి చేరుకొని లారీలోని ధాన్యం బస్తాలను పరిశీలించారు. ప్రభుత్వ సంచుల్లో ధాన్యాన్ని ఏపీలోని మండపేటకు తరలిస్తున్నట్లు గుర్తించి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.

యూరియా కొరత దేశవ్యాప్తంగా ఉంది

- రైతులను బీఆర్ఎస్ రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తోంది
- మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియాను పక్కదారి పట్టించారనడంలో వాస్తవం లేదు
- నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

నల్లగొండ: యూరియా విషయంలో రైతులను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తోందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనా నుంచి సరఫరా తగ్గిపోవడం వల్ల తెలంగాణలోనే కాదు దేశ వ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడిందన్నారు. కేంద్రం నుంచి యూరియా వస్తే రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పంపిణీ చేస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో ప్రధాని మోదీ మాట్లాడారని దాంతో యూరియా దిగుమతి జరుగుతుందన్నారు. త్వరలోనే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో నల్లగొండ జిల్లాలో 57 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేస్తే ఈ సంవత్సరం ఇప్పటికే 61 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఈ సీజన్‌లో అధికంగా పంపిణీ చేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారుల వద్దకు పోయి వివరాలు తీసుకుని మాట్లాడాలి కానీ, రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొట్టడం సరైంది కాదన్నారు. ఈసారి జిల్లాలో 5.68 లక్షల ఎకరాల్లో పత్తి, 5.35 లక్షల ఎకరాల్లో వరి సేద్యం చేశారని, దానికి అనుగుణంగా యూరియాలో ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియా పక్కదారి పట్టించారనడంలో వాస్తవం లేదని ఎంపీ రఘువీర్ స్పష్టం చేశారు. ఈ సంఘటనపై తాను కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడానని, వారు ఈ సంఘటనపై విచారణ చేసి ఎలాంటి పొరపాటు జరగలేదని తేల్చినట్లు ఎంపీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్, వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), చిట్యాల: ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి పోక్సో యాక్టు కింద 21 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎస్.రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు 2018 ఫిబ్రవరి 1వ తేదీన అదే గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తల్లితండ్రులకు తెలియడంతో చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. భరోసా సెంటర్ లీగల్ అధికారిణి ఎం.కల్పన, లయన్ ఆఫీసర్ పి.నరేందర్, ఎస్.మల్లిఖార్జున్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించి నిందితుడికి శిక్ష పడడంలో సహకరించారు.

9నెలల్లో 15 జైలు శిక్షలు

నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు జనవరి నుంచి ఇప్పటి వరకు 15 పోక్సో కేసుల్లో నిందితులకు జైలుశిక్ష విధించింది. నిందితులందరికీ 20ఏళ్లకు పైగా జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది.

ఉరేసుకుని ఆత్మహత్య

బీబీనగర్: బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన మార్త శ్రీవెన్నెల(17) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. సోమవారం మృతురాలి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శ్రీవెన్నెల ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.



శ్రీవెన్నెల (ఫైల్)

చోరీలకు పాల్పడుతున్న మల్టీపర్పస్ వర్కర్ అరెస్ట్

- తోటి సిబ్బంది ఇంట్లో కూడా దొంగతనానికి పాల్పడిన వైనం
- ఆరు తులాల బంగారం, 180 గ్రాముల వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పక్కన కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం

కోదాడరూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా చోరీలకు పాల్పడుతున్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌ను సోమవారం అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన బండ్ల భాస్కర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఖాళీ సమయంలో తాపీ మేస్త్రీ పనికి వెళ్తున్నాడు. ఏడాదిన్నర కిందట అతడి తల్లిదండ్రులు ఇద్దరూ అనారోగ్యం బారిన పడి నెల రోజుల వ్యవధిలో మృతిచెందారు. వారి వైద్యం కోసం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.8లక్షల వరకు అప్పులు తెచ్చాడు. పిల్లల చదువుల ఖర్చులు ఎక్కువ కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ పంచాయతీ విధుల్లో భాగంగా ఉదయం వేళ గ్రామంలో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవాడు. ఏడాదిన్నర క్రితం ఖానాపురం గ్రామానికి చెందిన పిడమర్తి సుశీల ఇంట్లో, ఈ ఏడాది మార్చిలో తొర్రికొండ కృష్ణకుమారి, కొంగల గంగ ఇళ్లలో, ఆగస్టులో తోటి మల్టీపర్పస్ వర్కర్ గుండ్లపల్లి ఏడుకొండలు ఇంట్లో భాస్కర్ చోరీలకు పాల్పడి ఆరు తులాల బంగారు ఆభరణాలు, 180 గ్రాముల వెండి దొంగలించాడు. దొంగిలించిన బంగారంలో కొంత తాకట్టు పెట్టాడు. మిగిలిన బంగారాన్ని కూడా తాకట్టు పెట్టేందుకు సోమవారం కోదాడకు వెళ్తూ.. గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడి నుంచి ఆరు తులాల బంగారం, 180 గ్రాముల వెండితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం, అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది రామారావు, నిరంజన్, ఏడుకొండలు, సీహెచ్. నరసింహారావును డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.